గ్రామాల్లో క్షీణించిన పారిశుద్ధ్యం

గుడివాడ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై చెత్త, చెదారాలు, మురుగునీరు చేరి అధ్వానంగా మారాయి. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని గ్రామాల్లోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మురికి కూపాలుగా అంతర్గత రోడ్లు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో నందివాడ, గుడివాడరూరల్, గుడ్లవల్లేరు మండలాలు ఉన్నాయి. దాదాపుగా 66 గ్రామ పంచాయతీలున్నాయి. వర్షాకాలం వచ్చినా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీ అధికారులు దృష్టిసారించడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలతో డ్రెయినేజీ, మురుగు నీరు ఎక్కడికక్కడ నిల్వ చేరి, దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామాల్లో కనీసం డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీలు ఎప్పటికప్పుడు పూడిక తీయకపోవడంతో మురుగునీరు పారుదల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయాలను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా ఇప్పటి వరకు గ్రామాల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయలేదని ప్రజలు పేర్కొంటున్నారు.

విజృంభిస్తున్న దోమలు

గ్రామాల్లో సైడ్ డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించి రోజుల తరబడి నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయి. మురుగు నీటిని బయటకు పంపే పనులను పంచాయతీ అధికారులు విస్మరించడంతో మురుగునీరు నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారాయి. దోమల వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దోమలు కుట్టడం వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైడ్ డ్రెయిన్ల పూడిక తీతకు వర్షాకాలంలో పంచాయతీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా అధికారుల అలసత్వం వలన పనులు చేయకపోవడంతో ఈ సమస్య తలెత్తుతుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్లపైనే చెత్త

గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వీధులు చెత్తచెదారాలతో నిండిపోతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణకు ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేశారు. పట్టణాల మాదిరిగానే గ్రామాల్లోనూ చెత్తను సేకరించేందుకు వాహనాలు, ప్రత్యేక సిబ్బందిని పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రతిరోజు సిబ్బంది గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించడంతో గ్రామాల్లో వీధులు పరిశుభ్రంగా ఉండేవి. ప్రభుత్వం మారిన తర్వాత నెల రోజుల నుంచి చెత్త సేకరణ పంచాయతీలు పక్కన పెట్టడంతో వీధులు మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయి. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.



పోలుకొండ ఎస్సీ, బీసీ కాలనీల్లోని అంతర్గత రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

వ్యాధులబారిన ప్రజలు

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు అటకెక్కడంతో అంటు వ్యాధులు విజృంభిస్తున్నాయి. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబు తదితర వ్యాధులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి వర్షాకాలంలో దోమల నివారణకు దోమల నివారణ మందును గ్రామాల్లో పిచికారి చేయాలి. ఎప్పటికప్పుడు పనులను పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది. గ్రామాల్లో ఆ విధమైన పనులు వర్షాకాలం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు చేసిన దాఖలాలు లేవు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో వ్యాధులు రోజురోజుకి విజృంభిస్తున్నాయనే ఆరోపణలున్నాయి.

అధికారుల పర్యవేక్షణ లోపం

వర్షాకాలలో పారిశుద్ధ్య పనుల నిర్వహణపై డివిజన్ పంచాయతీ అధికారి, మండల అభివృద్ధి అధికారి, ఈఓపీఆర్డీల పర్యవేక్షణ ఉండాలి. ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణ పనులను పర్యవేక్షించాలి. గుడివాడ నియోజకవర్గంలో ఉన్న గ్రామాల్లో ఆ పరిస్థితులు కన్పించడం లేదు. డివిజన్‌స్థాయి అధికారుల నుంచి మండల స్థాయి అధికారులు విధులను విస్మరించి పర్యవేక్షణ చేయకపోవడంతో గ్రామాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం వలన నియోజకవర్గంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసి, ప్రజలు అంటు వ్యాధులబారిన పడుతున్న పరిస్థితులు తలెత్తడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుద్ధ్యం నిర్వహణపై శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



నందివాడ మండలం వెంకటరామాపురం వద్ద పేరుకుపోయిన చెత్త

పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు

వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులకు చర్యలు చేపట్టాం. మురుగునీటి సమస్య పరిష్కారానికి సైడ్ డ్రెయిన్ల నిర్మాణం చేపడతాం. దోమల నివారణకు వెంటనే మందు పిచికారీ చేసేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం.

– జి.సంపత్‌కుమార్, డీఎల్‌పీఓ

క్లుప్తంగా

రేషన్ పంపిణీ 50 శాతం పూర్తి



పామర్రు: మండలంలో రేషన్ పంపిణీ 50 శాతం వరకు పూర్తయినట్లు పీడీఎస్ డీటీ వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలో జరుగుతున్న పంపిణీని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల పంచదార సరఫరాలో కొన్ని సమస్యలు ఉన్నందున పంపిణీ నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీ లోపుగా మిగిలిన వారికి రేషన్ పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే నెల నుంచి బియ్యం, పంచదార, కందిపప్పును ప్రభుత్వం సరఫరా చేయనున్నట్లు డీటీ తెలిపారు.

అమ్మవారికి ఆషాఢ సారె



గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లో వేంచేసియున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వారాహి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం ఆర్యవైశ్య మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. పామర్రుకు చెందిన ఆర్యవైశ్య మహిళలు ఈ సారెను సమర్పించినట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు తెలిపారు. వారాహి నవరాత్రుల్లో భాగంగా ఒకరోజు అమ్మవారికి పామర్రు ఆర్యవైశ్య మహిళలు సారె సమర్పించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వనితా విదర్భపురి నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి విశేష పూజలు



పామర్రు: ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఆషాఢ మాసం తొలి మంగళవారం విశేష పూజలు చేశారు. అనంతరం స్వామికి శత నామ అష్టోత్తరాలతో నాగవల్లీలతో పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు, సహాయకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అడపా బాబ్జికి ఘన నివాళులు



గుడివాడ టౌన్: మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు అడపా వెంకట రమణ(బాబ్జి) జయంతి వేడుకలు మంగళవారం స్థానిక బేతవోలులోని శాంతి వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి అభిమానులకు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో అన్నసమారాధన జరిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె. ఆంజనేయప్రసాద్, చుండూరి శేఖర్, రామకృష్ణ(ఆర్‌కె), దేవిరెడ్డి శంకర్, తోట సాయికుమార్, తెనాలి ఫణి, మహిళా కార్యకర్తలు రమీజా, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి ఉచిత ఇసుక

పమిడిముక్కల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నెలరోజుల్లోనే ప్రజలకు ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. త్వరలో మెరుగైన ఇసుక పాలసీని తీసుకొస్తామన్నారు. ఇసుక దోపిడీకి పాల్పడినా, బ్లాక్‌లో అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పామర్రులో ప్రతి గురువారం ప్రగతిపథం

పామర్రు టౌన్‌లో ప్రతి గురువారం ప్రగతి పథం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే రాజా తెలిపారు. రానున్న రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మండల, గ్రామాల స్థాయిలోకి విస్తరిస్తానని పేర్కొన్నారు. సర్పంచ్ ముళ్లపూడి సునీత పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణదారులను ఉపేక్షించవద్దు



కైకలూరు: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునే వారిని ఉపేక్షించవద్దని, ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి అధ్యక్షతన మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. గ్రామంలో సమస్యలను సర్పంచ్ వివరించారు. కామినేని మాట్లాడుతూ కైకలూరులో తాగునీరు, డ్రెయినేజీలు, డంపింగ్‌యార్డు సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. కైకలూరులో వాటర్ ప్లాంట్ల ద్వారా విక్రయిస్తున్న నీటి శాంపిల్స్‌ను పరీక్షించి, నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. తోపుడు బండ్లు మినహాయించి రహదారుల వెంబడి శాశ్వత కట్టడాలు చేసిన దుకాణదారుల ఆక్రమణలను తొలగించాలన్నారు. గ్రామంలో పందుల సంచారం ఉందని, ఆయా కుటుంబాలతో మాట్లాడి ఆగస్టు 10 నాటికి వాటి సంచారం లేకుండా చేయాలని ఎస్సైను ఆదేశించారు. పంచాయతీ స్థలాలను ఆక్రమించుకుని డ్రెయిన్లు నిర్మించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, కూటమి నాయకులు జెడ్పీటీసీ కె.బేబీ, త్రినాథరాజు, పూల రాజీ, మాజీ ఎంపీపీ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కను నాటండి

కైకలూరు: ప్రధాని మోదీ పిలుపు మేరకు అమ్మపేరుతో ప్రతిఒక్కరూ మొక్కను నాటాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆయన స్వగ్రామం వరహాపట్నంలో ఇంటి వద్ద, లక్ష్మీనృసింహదేవాలయం వద్ద మంగళవారం మొక్కలను నాటారు. అనంతరం కై కలూరు ఎన్జీవోస్ కాలనీలో పాలచర్ల శ్రీనివాసచౌదరీ నివాసం వద్ద, తహసీల్దారు కార్యాలయాల వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. మానవత సంస్థ నుంచి ఇటీవల కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్ల పంపిణీ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 12 మంది పేద విద్యార్థులకు అడ్మిషన్ ఫీజు రూ.24,000 సంస్థ ద్వారా అందించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

పమిడిముక్కల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల విషయంలో పార్టీలకతీతంగా ప్రొటోకాల్ ప్రకారం నడుచుకోవాలన్నారు. సాగునీటి కాలువల మరమ్మతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని, కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు చేపట్టినట్లు చెప్పారు. నివాస ప్రాంతాల్లో మురుగునీటిని తొలగించి బ్లీచింగ్ చల్లాలన్నారు. మర్రివాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ ఫ్రాన్సిస్ కోరగా, సమస్య పరిష్కారానికి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. మంటాడ రెడ్డిపాలెంలో తాగునీరు అపరిశుభ్రంగా ఉందని సర్పంచ్ నందమూడి వీరమ్మ తెలిపారు. ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని, గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించారు. తొలుత ఎమ్మెల్యేను ఎంపీడీఓ మహబూబ్ సుభానీ, ఎంపీపీ సుప్రజ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణకుమారి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది సత్కరించారు. వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఈఓఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.



స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

పామర్రు: నాణ్యతా ప్రమాణాలకు లోబడి రహదారులను నిర్మించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గ్రామంలో నల్లగుంట రోడ్డు రామాంజనేయ కాలనీ నిర్మిస్తున్న రహదారిని స్థానికులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల మధ్యన అనుసంధానంగా ఉండే రహదార్లను ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కాలనీ వాసులు ఎమ్మెల్యే కుమార్ రాజాను, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్‌ను సత్కరించారు.

కలెక్టర్ బాలాజీ సేవలు ప్రశంసనీయం

పమిడిముక్కల: జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సేవలు ప్రశంసనీయమని యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ రాష్ట్ర కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ అన్నారు. మచిలీపట్నంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని శ్రీనివాసగౌడ్ ఆర్‌టీఐ ప్రతినిధులతోకలిసి సత్కరించి అభినందనలు తెలిపారు. జిల్లాపై పాలనాపరంగా కలెక్టర్ పట్టు సాధించి మంచి పనితీరుతో రాణిస్తున్నారని శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఆర్‌టీఐ ప్రతినిధులు మత్తే నాగరాజు, బయ్యవరపు దుర్గాప్రసాద్, శివపార్వతి పాల్గొన్నారు.



కలెక్టర్ బాలాజీని సత్కరిస్తున్న ఆర్‌టీఐ నాయకులు

సాగు నీరేది?

- పంటబోదెలకు చేరని పరిస్థితి
- జూలై నెల రెండో వారం అయినా పడని నాట్లు
- ఇబ్బందుల్లో రైతులు

పామర్రు: మండల పరిధిలో సాగునీరు లేక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక పుల్లేరు, నాగులేరు కాల్వల్లోకి పూర్తి స్థాయిలో నీరు రాక పోవడం, నీటి ధార తక్కువగా ఉండటంతో పిల్ల కాల్వలకు నీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. పైనుంచి జల లేకపోవడంతో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంజిన్లతో నీటిని తోడినా పంట కాలువలకు నీరు అందడం లేదని దీంతో సాగు కష్ట తరంగా ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాపర్ల, జమీదగ్గుమిల్లి తదితర గ్రామాల్లోని పంట కాలువ వెంట సుమారు 700 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. సాగుకు నీరు అందకపోవడం కారణంగా ఇంతవరకు వరి నాట్లు పడిన దాఖలాలు లేవు. కొన్నిచోట్ల పోసిన నారుమళ్లకు కూడా నీరు సక్రమంగా అందే పరిస్థితి లేదని రైతులు పేర్కొంటున్నారు.

చివరి ప్రాంతాలకు సాగునీరేది?

చివరి ప్రాంతాలోకల వరి సాగుకు నీరు అందక రైతులు అవస్థ పడుతున్నారు. స్థానిక నాగులేరు కాలువల ద్వారా నీటిని విడుదల చేయకపోవడంతో నీరు సాగుకు అందక ఇబ్బందులు పడుతున్నామని రైతులు పేర్కొంటున్నారు. జూలై నెల రెండవ వారంలో కూడా సాగుకు నీరు అందక పోవడం కారణంగా నాట్లు వేసుకోలేక పోతున్నామంటున్నారు.



నీరులేక నాట్లు వేయని దృశ్యం

అదనపు ఖర్చు చేస్తేనే సాగు

పంట కాలువల ద్వారా నీరు రాకపోవడంతో బోర్లలోని నీటిని ఇంజిన్ల సాయంతో సాగుకు నీరు అందించాల్సి వస్తోంది. దీంతో రైతులపై అదనపు భారం పడుతోందని ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల సాగునీటి కోసం స్థానిక మంచినీటి చెరువులనుంచి నీటిని తోడుకుంటూ వరి నాట్లు వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరి సాగు ప్రారంభంలోనే అనేక అదనపు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడుగంటుతున్న మంచినీటి చెరువులు



ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటుతున్నాయి. చెరువులకు కాలువల ద్వారా నీరు సరఫరా చేసి రెండు నెలలు దాటింది. అప్పట్లో చెరువులను నీటితో నింపినప్పటికి వేసవిలో చెరువుల్లోని నీరు ఇంకిపోయింది. ఇప్పటికే పలు గ్రామాల్లో పంచాయతీలు ఒక్కపూట మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా చేస్తున్నాయి. గతంలో రెండు పూటలా నీటిని విడుదల చేసేవారు. ప్రస్తుతం ఒక పూట మాత్రమే నీటిని విడుదల చేస్తున్నందున వాడుక నీటికి సైతం ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. జూన్ ముగిసి జూలై ప్రవేశించినప్పటికీ ఇప్పటివరకు కాలువలకు నీటిని విడుదల చేయలేదు. దీనిపై సంబంధిత అధికారులు సైతం నీటిని ఎప్పుడు విడుదల చేసేది స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. కొన్ని చెరువుల్లో నీరు పూర్తిగా కలుషితం కావడంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 41 మంచినీటి చెరువులుండగా 90 శాతం పైగా చెరువుల్లో ఇదే పరిస్థితి నెలకొంది. నీరంతా కలుషితమై పసర్లు కట్టి వాసన వస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కాలువలకు నీటిని విడుదల చేసి చెరువులు నింపాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా డీఎన్నార్ పుట్టినరోజు



మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) జన్మదిన వేడుక కైకలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఉత్సాహంగా జరిగింది. నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు తరలివచ్చి డీఎన్నార్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యుల నడుమ ఆయన భారీ కేక్‌ను కట్ చేశారు.కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ విచ్చేసి డీఎన్నార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీలు పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రామిసెట్టి సత్యనారాయణ, చందన ఉమామహేశ్వరరావు, ముదినేపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే పల్లి వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీలు మహమ్మద్ జహీర్, రాచూరి రాధా, నాయకులు చేబోయిన వీర్రాజు, గంటా సంధ్య, గుమ్మడి వెంకటేశ్వరరావు, గోట్రూ ఏసుబాబు, తిరుమాని రమేష్, పంజా రామారావు, బలే నాగరాజు, ముంగర గోపాలకృష్ణ, జయమంగళ కాసులు, రఫీ, బూరుబోయిన మోహనరావు, వసంత కుమారి, బేతపూడి ఏసుబురాజు, శ్యామ్‌సుందర్, సాదు కొండయ్య, పట్టపు బాలమ్మ పాల్గొన్నారు.

బీజేపీది కార్మిక వ్యతిరేక పాలన



గుడివాడ టౌన్: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కార్మికులను అణచివేసే విధంగా పాలన సాగిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిరసన కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మికులను పూర్తిగా అణచివేసే విధానాలను అమల్లోకి తెస్తుందన్నారు. ఇప్పటికే కనీస వేతనం అమలుపై దృష్టిపెట్టని కేంద్ర ప్రభుత్వం ప్రావిడెంట్ ఫండ్ విషయంలో కూడా కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాస్తోందన్నారు. దీనిని నిరసిస్తూ ఈనెల 10వ తేదీన అన్ని మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని శాఖల కార్మికులు, కార్మిక నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.కొండ, గుడివాడ పట్టణ ఉపాధ్యక్షుడు ఎం.నారాయణ పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మంగళవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేయించుకుని స్వామివారిని దర్శించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రధాన అర్చకుడు తోలేటీ వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

హైస్కూల్‌కు ఫ్యాన్ బహూకరణ



మండవల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఫ్యాన్ బహూకరించారు. ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ మెండా ఝాన్సీ చేతుల మీదుగా హైస్కూల్ హెచ్ఎం ప్రసాద్‌కు 2010 సంవత్సరం పూర్వ విద్యార్థులు మంగళవారం ఫ్యాన్ అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, పూర్వ విద్యార్థి రాజేష్ పాల్గొన్నారు.

దేవస్థానం చెరువుల బహిరంగ వేలం

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన చెరువుల కౌలు హక్కులకుగాను టెండర్ కం బహిరంగ వేలం పాటలు ఈ నెల 10వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. దేవస్థానం ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు దేవదాయశాఖ ధర్మదాయశాఖ అధికారుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించనున్ననట్లు పేర్కొన్నారు.

శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయంలో భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకల లెక్కింపు బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు తెలిపారు. ఆసక్తిగల భక్తులు డ్రెస్‌కోడ్‌లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.